http://www.agnidharanews.com

# అగ్నిధార

సోమవారం 6 జనవరి 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## ఆర్థిక సాయం కాదు..

# ప్రోత్సాహం

- జాబ్ క్యాలెండర్‌పై సీఎం రేవంత్ కీలక ప్రకటన
- సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించిన 20 మందికి ఆర్థిక సాయం
- సివిల్స్ ఇంటర్వ్యూ కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం
- సివిల్స్‌లో సత్తా చాటిన అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహం
- సింగరేణి సంస్థ సహకారంతో ప్రతిభ కలిగిన పేద అభ్యర్థులకు వెలుగులు నింపే ప్రయత్నం
- సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్తున్న అభ్యర్థులకు ఆర్థిక సాయం చేస్తూ భరోసా ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం.



హైదరాబాద్

సివిల్స్ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కులను సీఎం రేవంత్ అందించారు. 20 మంది అభ్యర్థులకు ఒక్కొకరికి లక్ష రూపాయల చెక్కును ఇచ్చారు. సింగరేణి సంస్థ నుంచి ఈ ఆర్థిక సాయం అందించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ ఆర్థిక సహాయం సివిల్స్ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి అభిప్రాయపడ్డారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సివిల్స్ - మిగతా3లో



## రైతులకు మద్దతుగా

# బీఆర్ఎస్

- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన కేటీఆర్
- రైతు భరోసాపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

హైదరాబాద్

రైతు భరోసా ఎందుకు ఇవ్వరో రేవంత్ రెడ్డి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతు భరోసాపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేపు రాష్ట్రవ్యాప్తంగా - మిగతా3లో

## ఎన్ని ఇబ్బందులున్నా..

# రుణ మాఫీ చేస్తాం



- వారిద్దరి మాటలు చూస్తుంటే.. కడుపు తరుక్కుపోతోంది
- తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేక పోతున్నారు
- ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లకు తగ్గకుండా ఇస్తాం
- ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ. లక్ష రుణమాఫీ సైతం చేయ లేక పోయారు
- బీఆర్ఎస్ రూ.7 లక్షల అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసింది

వరంగల్

ఎన్ని ఇబ్బందులున్నా.. రైతులకు తాము రుణ మాఫీ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రూ. లక్ష రుణ మాఫీ చేయ లేని వాళ్లు కూడా మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆయన మండిపడ్డారు. ఆదివారం వరంగల్‌లో డిప్యూసీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేక పోతున్నారన్నారని మండిపడ్డారు. ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లకు తగ్గకుండా ఇస్తామని ఆయన ప్రకటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా - మిగతా3లో



## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి

- దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయే
- మనం 2025 సంవత్సరంలో ఉన్నాం
- 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయి..
- శతాబ్దంలో పావు సంవత్సరం ముగిసిపోయింది
- రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకం
- ఈ పాలిక్లేల్లో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## కన్ఫ్యూజన్‌లో

# గులాబీ కేడర్

- పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా?
- పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది?
- సీఎం రేసు కోసం కేటీఆర్-కవిత పోటీ పడుతున్నారా?
- ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది
- నేతల వలసలు కాసేపు పక్కన బెడితే..
- వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు.

భారత రాష్ట్ర సమితి BHARAT RASHTRA SAMITHI

హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారా? పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా? పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది? సీఎం రేసు కోసం కేటీఆర్-కవిత పోటీ పడుతున్నారా? ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది. అధికారం పోయిన తర్వాత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్. నేతల వలసలు కాసేపు పక్కన బెడితే.. వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు. ఇక అసలు విషయానికొద్దాం..పార్టీ - మిగతా3లో

# బాబోయ్ చలి

- రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు..
- మరో 3 రోజులు బీభత్సమే
- నాలుగైదు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వినిపిస్తున్న మాట.
- చలిభయంతో బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్న పరిస్థితి
- అదే సమయంలో ఆరోగ్య శాఖ నుంచి కూడా హెచ్చరికలు
- అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమే అంటున్న వైద్యులు



## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

ఓయో సంచలన నిర్ణయం.. రూమ్ బుక్ చేసుకునే సమయంలో తమ రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే ఐడీ ప్రూఫ్‌ను సమర్పించాలి



## ఒక్క చాన్స్ ప్లీజ్...

# నామినేటెడ్ ఎమ్మెల్సీల కోసం జోరుగా ప్రయత్నాలు



**బెంగళూరు:** విధానపరిషత్‌కు నామినేటెడ్ విధానంతో నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున ఆశావాహులు తీవ్రస్థాయిలో లాబీ చేస్తున్నారు. సభ్యులు యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ బీజేపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 27న జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పరిషత్ పదవీకాలం ముగియనుంది. ఇలా నాలుగు స్థానాలకు ఖాళీ ఏర్పడగా, కాంగ్రెస్ నుంచి ఎంపిక చేసే వెసలుబాటు ఉంది. అయితే ఆ స్థానాలకు ఏకంగా 20 మంది దాకా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్ మరోసారి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ సభాపతి బీఎల్ శంకర్, మాజీ మంత్రి రాణి సతీషలు ఇప్పటికే సీఎంను కలిసి అవకాశం కోరినట్లు తెలుస్తోంది. నలుగురిని భర్తీ చేయాల్సి ఉన్నందున డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయంతో పాటు ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు ఇటు సీఎం, డీసీఎంలతోనే కాకుండా ఢిల్లీలో ఖర్గేతో పాటు ఇతర నేతల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగానే నలుగురిని ఎంపిక చేయడం ద్వారా పరిషత్‌లో ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి బలం పెంచుకోదలచారు. నలుగురిని ఎంపిక చేయాలంటే సీఎం, డీసీఎంలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత అధిష్టానం ఆమోదం కూడా లభించాల్సి ఉంటుంది.

## భారీ బోర్డింగ్ పాస్ చూపించిన వ్యక్తి..
## ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది ఏం చేశాడంటే?



**న్యూఢిల్లీ:** ఒక విమాన ప్రయాణికుడు విభిన్నంగా వ్యవహరించాడు. బోర్డింగ్ పాస్‌ను పెద్ద పేపర్‌పై ప్రింట్ తీశాడు. ఎయిర్‌పోర్ట్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి దీనిని చూపించాడు. ఇది చూసి అతడు షాక్ అయ్యాడు. అందులోని వివరాలు పరిశీలించేందుకు కాస్త ఇబ్బంది పడ్డాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విమానంలో ప్రయాణించేందుకు ఒక వ్యక్తి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి భారీ సైజులో ప్రింట్ చేసిన బోర్డింగ్ పాస్‌ను రెండు చేతుల్లో పట్టుకుని చూపించాడు. ఇది చూసి ఆ సెక్యూరిటీ అధికారి అయోమయం చెందారు. పెద్ద పేపర్‌పై ప్రింట్ చేసిన టిక్కెట్ వివరాలను సరిచూసుకునేందుకు కాస్త ఇబ్బందిపడ్డారు. బోర్డింగ్ పాస్‌ను ఇలా ప్రింట్ చేయాలని నీ స్నేహితులకు చెప్పవద్దని నవ్వుతూ అన్నారు. కాగా, ఈ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'వారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారేమో' అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నెటిజన్లు కూడా ఫన్నీగా స్పందించారు. ప్రాంక్ చేసేందుకు లేదా సోషల్ మీడియాలో ప్రమోట్ అయ్యేందుకు ఆ వ్యక్తి ఇలా చేసి ఉంటాడని కొందరు పేర్కొన్నారు. మరోవైపు ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించింది. పేపర్‌ను సేవ్ చేయాలని సూచించింది. తమ ద్వారా కొనుగోలు చేసిన విమాన టిక్కెట్లను వాట్సాప్‌లో కూడా చూపించవచ్చని పేర్కొంది. మీ ప్రయాణం కంటే మీ జీవితం, అభిరుచి పెద్దవని ప్రశంసించింది.

## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

పెళ్లికి ముందే ప్రైవసీ కోసం ఎక్కువమంది ఎంచుకునే ఆప్షన్ ఓయో రూమ్స్. వివాహంతో సంబంధం లేకుండా పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం కలిగిన వ్యక్తులు ఓయో రూమ్స్‌కు వెళ్తుంటారు. స్త్రీ, పురుషుల గుర్తింపు కార్డు చూపించి, టారిఫ్ చెల్లిస్తే ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా రూమ్స్ కేటాయిస్తారు. ఎక్కువమంది కాలేజీ అబ్బాయిలు, అమ్మాయిలు ఓయో సర్వీసెస్ ఉపయోగించుకుంటున్నారు. కొందరు ఓయో సర్వీసెస్‌ను తప్పుపడుతున్నారు. తమ పిల్లలు చెడిపోవడానికి ఇవి కారణమవుతున్నాయని విమర్శించేవాళ్లు ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఓయో హాస్పిటాలిటి సేవలను అందిస్తోంది. తక్కువ ధరకే రూమ్స్ అందించడంతో ఓయో సర్వీసెస్ తక్కువకాలంలో అందరినీ ఆకర్షించాయి. అదే సమయంలో కపుల్స్ కాకపోయినా పరస్పర అంగీకారంతో అమ్మాయి, అబ్బాయి ఒకే రూమ్‌లో ఉండేందుకుఓయో హోటల్స్ అనుమతిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనల దృష్ట్యా ఓయో హోటల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.

**వారికి నో ఎంట్రీ..**


ఓయో హోటల్స్‌లో రూమ్ బుక్ చేసుకోవడం ఎంతో ఈజీ. ఓయో యాప్‌లో రూమ్ బుక్ చేసుకుని, నేరుగా హోటల్‌కు వెళ్తే గది కేటాయిస్తారు. రూమ్‌లో ఉండే వ్యక్తుల గుర్తింపు కార్డు జిరాక్స్ హోటల్ రిసెప్షన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అంతేతప్ప మిగిలిన ఏ వివరాలు అడగరు. ముఖ్యంగా ప్రైవసీ కోరుకునేవారికి ఓయో రూమ్స్ అనువైన ప్రదేశంగా చెబుతారు. ఇప్పటివరకు ఎవరైనాఓయోలో రూమ్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండగా.. తాజాగా ఓయో పెళ్లి కాని జంటలకు రూమ్స్ ఇవ్వబోమనే కొత్త రూల్ తీసుకొచ్చింది. ఓయో తీసుకొచ్చిన నూతన చెక్ ఇన్ పాలసీలో పెళ్లి కాని జంటలు రూమ్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ నిబంధనలను తొలుత ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అమలు చేస్తోంది. ఆ తర్వాత ఈ విధానాన్ని దేశమంతా విస్తరించే ఛాన్స్ ఉంది. ఇకనుంచి రూమ్ బుకింగ్ సమయంలో జంటలు తమ పెళ్లిని నిర్ధారించే గుర్తింపు కార్డును సమర్పించాలి. సురక్షితమైన, బాధ్యతాయుతమైన హాస్పిటాలిటీకి తాము కట్టుబడి ఉన్నామని ఓయో నార్త్ ఇండియా హెడ్ పవాస్ శర్మ తెలిపారు.

**గుర్తింపు చూపిస్తే..**

ఎవరైనా జంటలు ఓయోలో రూమ్స్ బుక్ చేసుకోవాలంటే వివాహ ధృవీకరణ లేదా, కపుల్స్‌గా ధృవీకరించే ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. గతంలో వలె రూమ్స్ బుక్ చేసుకునే విధానంలో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఓయో నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. ప్రేమికులకు మాత్రం ఇది షాకింగ్ అనే చెప్పుకోవాలి. జంటగా ధృవీకరించే పత్రాలు బుకింగ్ సమయంలో సమర్పించకపోతే వారికి రూమ్ బుక్ కాదనే చెప్పుకోవాలి.

## పూరీలోని జగన్నాథ ఆలయంపై ఎగిరిన డ్రోన్..

# కలకలం రేపిన ఘటన



**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది. భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

## ఒకసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం కష్టం..

# జోహో సీఈఓ హెచ్చరిక



**ఇంటర్నెట్ డెస్క్:** జనాభా తగ్గుదల ఒక్కసారి మొదలైతే పరిస్థితిని చక్కదిద్దడం చాలా కష్టమని జోహో కార్పొరేషన్ సంస్థ సీఈఓ శ్రీధర్ వెంబు తాజాగా హెచ్చరించారు. చైనా, జపాన్‌లోని పరిస్థితులను ఇందుకు తాజా ఉదాహరణగా పేర్కొన్నారు. "1990ల్లో జపాన్ సాంకేతికంగా ఉచ్ఛస్థితికి చేరుకుంది. అమెరికాను కూడా చైనా మించిపోనుందని అప్పట్లో జనాలు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడేమైందీ.. అక్కడి జనాభా తగ్గిపోవడంతో కొత్త సమస్యలు ప్రారంభమవుతున్నాయి" అని ఆయన తాజాగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం చైనాలో కూడా దాదాపు ఇదే పరిస్థితి పునరావృతమవుతోం దని అన్నారు దేశాల్లో పారిశ్రామీకరణ, నగరీకరణ జరుగుతున్న తీసుకునే నిర్ణయాలు, సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతుండటం, చిన్న కుటుంబాల సంఖ్య పెరగడం తదితరాలు జనాభా తగ్గుదలకు దారి తీస్తాయని శ్రీధర్ వెంబు చెప్పారు. "ఒక్కసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం చాలా కష్టం. నాకు తెలిసి ఈ పరిస్థితి అడ్డుకున్న దేశం ఒక్కటి కూడా లేదు. అందుకే నేను గ్రామీణ జీవనానికి, మన సంప్రదాయాలవైపు మొగ్గు చూపుతాను" అని ఆయన అన్నారు. జంటలను పిల్లల్ని కనేలా ప్రోత్సహించే అభివృద్ధి విధానాలకే తన మద్దతు అని స్పష్టం చేశారు. మిగతావేటికీ ఇంత ప్రాముఖ్యత లేదని స్పష్టం చేశారు. భారత జనాభాలో మార్పులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో జోహో సీఈఓ వ్యాఖ్యలు మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లోకి వచ్చాయి. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.1 కాగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ రేటు 1.6కి చేరుకుంది. దీంతో, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరిగి దేశంపై భారం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా తగ్గుదలతో ప్రమాదాలపై కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. జనాభాలో ప్రతికూల మార్పులను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

## జేడీఎస్ నిర్వీర్యానికే.. ఆపరేషన్ హస్త కుట్ర

ప్రలోభ పెట్టినట్లు ఎమ్మెల్యేలు స్వయంగా చెప్పారు..

12 మందిని పార్టీ మార్చే ప్రయత్నాలు జరిగాయి

కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ



**బెంగళూరు:** జేడీఎస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఆపరేషన్ హస్త కుట్ర పన్నారని కేంద్రమంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బెంగళూరులో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీకి చెందిన 12-13 మంది ఎమ్మెల్యేలను పార్టీ మార్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అయితే జేడీఎస్ ఎమ్మెల్యేలను మార్పు చేయడం అంత సులువు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలు పెరిగాయన్నారు. తమ ఎమ్మెల్యేలు తనకు పూర్తి సమాచారం అందించారన్నారు. సంక్రాంతి ముగిసే దాకా ఏమీ మాట్లాడేది లేదన్నారు. జేడీఎస్ ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, జేడీఎసను ఎప్పటికీ నిర్వీర్యం చేయలేరన్నారు. దేవుడే కాంగ్రెస్‌కు తగిన శిక్ష వేస్తారన్నారు. దేశంలో గ్యారెంటీలకు పోటీ పడుతున్నారన్నారు. తొలుత అమలు చేసిన హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి ఏం జరిగిందో తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితి ఉందో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రాంట్ల కోసం ఎన్ని తంటాలు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానం ఉంటే ప్రభుత్వం ఏదిశగా వెళుతుందో దృష్టి సారించాలన్నారు. మైసూరులో ప్రిన్సెస్(మహారాణి) పేరుతో ఉండే రోడ్డుకు సిద్దరామయ్య పేరు పెట్టాలనే ప్రస్తావనపై ఆయన ఎద్దేవా చేశారు. కర్ణాటకకే సిద్దరామయ్య పేరు పెడితే బాగుంటుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ సీనియర్ నేత జీటీ దేవెగౌడతో తనతో భార్యాభర్తల సంబంధమన్నారు. ఎన్నోసార్లు గొడవలు జరుగుతాయని ఆతర్వాత సమిసిపోతాయన్నారు.

## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి



**న్యూఢిల్లీ:** ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఢిల్లీ ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయేనని అన్నారు. రోహిణిలో ఆదివారంనాడు జరిగిన 'బీజేపీ పరివర్తన యాత్ర'లో ఆయన మాట్లాడుతూ, మనం 2025 సంవత్సరంలో ఉన్నామని, 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయని, శతాబ్దంలో పావు సంవత్సరం ముసిగిపోయిందని అన్నారు. ఈ 25 ఏళ్లలో రెండు, మూడు తరాల యువతరం ఢిల్లీలో ఎదిగిందని, రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకమని చెప్పారు. ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుందని అన్నారు. "ఢిల్లీలో ఈరోజు వేల కోట్లు విలువచేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. రాబోయే 25 ఏళ్లు, దేశానికి, ఢిల్లీకి చాలా కీలకం. వికసత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్ళ్తుం" అని ప్రధాని చెప్పారు. ఢిల్లీ ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, ఢిల్లీని బీజేపీ అభివృద్ధి పథకంలోకి తీసుకువెళ్తుందని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో 'విపత్తు'నే చూశామని, అభివృద్ధేనే ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల కోసం బీజేపీ పనిచేస్తుందని నమ్మకం ప్రజలకు ఉందని అన్నారు. ప్రజావిశ్వాసం చూరగొనడం వల్లే హర్యానా, ఒడిశా, మహారాష్ట్ర వంటి పలు ఎన్నికల్లో పార్టీ గెలుపొందిందని, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తుందనే గట్టి నమ్మకం ఉందన్నారు.

**ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా..**

ఢిల్లీకి ప్రపంచంలోనే ఉత్తమ నగర హోదాను తీసుకురాగలిగే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని మోదీ అన్నారు. 'ఆప్‌దా'ను ఢిల్లీ నుంచి తొలగించి ఢిల్లీ ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.

# ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో తర్వలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సీఎం అతిషిపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. 'బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం' అని అన్నారు. కాగా, బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బీజేపీ మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. 'ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధూరి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి ఎంపీపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బీజేపీ అసలు ముఖం ఇదే' అని ఎక్స్‌లో విమర్శించారు.



http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

# బాబోయ్ చలి



తెలుగు రాష్ట్రాలపై చలిపులి..పంజా విసురుతోంది. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. అయితే.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తోంది.. సంగారెడ్డి జిల్లా జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది.. ఇక రాత్రి పూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.. రాష్ట్రంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత కోహిర్ లో 6 డిగ్రీలు నమోదు అయ్యింది. ఈ సీజన్లో జిల్లాలో ఇదే అత్యల్ప ఉషోగ్రత.. సంగారెడ్డి జిల్లాలోని 22 ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువ ఉషోగ్రతలు నమోదు కాగా.. మెదక్ జిల్లాలో ఆరు చోట్ల 10 డిగ్రీల కంటే తక్కువ ఉషోగ్రతలు నమోదయ్యాయి.. తెలంగాణలో చలితీవ్రత మరో 3 రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు తలిపారు.

**రోజంతా చలి పంజా..**

రోజంతా చలి పులిలా పంజా విసురుతోంది.. వేకువజామున మొదలవుతున్న దట్టమైన పొగమంచు కమ్మేస్తూ ఉదయం 12గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు.. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.. బయటకు రావాలంటేనే జనం జంకే పరిస్థితి ఏర్పడింది.. గత కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి..రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లాలోని కోహిర్ లో 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. న్యాల్ కల్ 6.3.. అల్మాయి పేట 7.3, మల్ చెల్మ7.5, నల్లవల్లి 7.7, అల్గోల్ 7.9, సత్వార్ 8.1, బీహెచ్ఈఎల్ 8.2, నిజాంపేట్ 8.5, ఝరాసంగం 8.7, కంకోల్ 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

మెదక్, సిద్దిపేట జిల్లాలో కన్నా సంగారెడ్డిజిల్లాలో చలి తీవ్రత ఎక్కువ ఉంది.. చాలా చోట్లా సింగిల్ డిజిట్ నెంబర్ కి పడిపోతున్నాయి ఉష్ణోగ్రతలు%ా% ప్రతిరోజు మార్నింగ్ వాక్ కు వెళ్లే అలవాటున్న వాకర్స్, తెల్లవారుజామున 5 గంటలకే నిద్రలేచి మార్నింగ్ వాక్ వెళతారు..పెరిగిన చలి కారణంగా వాకర్స్ ఉదయాన్నే లేవడం లేదు..చలికి భయపడి బయటకు రావడం లేదు.. ఉదయం 7 గంటలు దాటాక మార్నింగ్ వాక్ కు బయలు దేరుతున్నారు.

**వైద్యుల సూచనలు..**

ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోతుండటంతో ఆస్తమా పేషంట్లు, వృద్ధులు, చిన్నారులకు ప్రమాదమని వైద్య నిపుణులు చెపుతున్నారు.. అనూహ్యంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న దగ్గు, జలుబు బాధితులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు.. రెండేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు ఈ చలి కారణంగా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యల తీవ్రత సాధారణ పరిస్థితులతో పోలిస్తే 20 శాతం నుంచి 30 శాతం పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అ అప్పర్ రెస్పిరేటరీ ఇన్? ఫెక్షన్ గా చెప్పబడే ఈ సమస్య ఎక్కువైతే ముక్కు కారడం.. ఊపిరి తిత్తుల్లోకి చల్లగాలి వెళితే వాయు నాళాలు కుచించుకు పోయి శ్వాస ఇబ్బందితో దగ్గు కూడా తీవ్రమవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.


# ఆర్థిక సాయం కాదు.. ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

మెయిన్స్ ఉత్తీర్ణత సాధించిన 20 మందికి ఆర్థిక సాయం అందజేశారు. సివిల్స్ ఇంటర్వ్యూ కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని .. అలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు.

సివిల్స్‌లో తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలని తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. బీహార్ నుంచి అత్యధికంగా సివిల్స్‌లో రాణిస్తున్నారని అన్నారు. అలాంటి ప్రత్యేక శ్రద్ధ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉండాలని, వారికి ఆర్థికంగా సహకారం అందించాలని రాజీవ్ సివిల్స్ అభయహస్తం ద్వారా రూ.లక్ష సాయం అందిస్తున్నామని ప్రకటించారు. ఇది ఆర్థిక సాయం కాదు%ా% ప్రభుత్వం వారికి అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలని అన్నారు. కష్టంతో కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని చెప్పారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి ఏడాదిలోనే 55143 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

14 ఏళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని.. కానీ తాము అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్ 1 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించామని ఉద్ఘాటించారు. మార్చి 31 లోగా 563 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాలను పూర్తిచేయబోతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఆలోచించేది యువత భవిష్యత్ కోసమే అని చెప్పారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలో అత్యధికంగా మన రాష్ట్రం నుంచి సివిల్స్‌లో ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతోందని అన్నారు. గ్లోబల్ సిటీ హైదరాబాద్‌లో అవకాశాలు ఎక్కువ అని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు రావాలని చెప్పారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. తమ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుందని అన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



అత్యంత వెనుకబడిన బిహార్ నుంచి సివిల్స్‌కు అత్యధికంగా ఎంపికవుతున్నారు. బిహార్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికవుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. అలాంటి సహకారం అందించాలనే ఆలోచనతోనే సివిల్స్ అభ్యర్థులకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇది ఆర్థిక సాయం కాదు. అభ్యర్థులకు అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులు ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా రాష్ట్రానికి సేవ చేయాలన్నారు.

ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం

గ్రూప్ 1 సహా అనేక ఉద్యోగాల భర్తీ చేస్తుంటే.. నిరుద్యోగులను రెచ్చగొట్టి కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో ఎన్నడూ లేని విధంగా 563 గ్రూప్ 1 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ఇన్ని ఉద్యోగాలు ఇస్తుంటే తట్టుకోలేక.. ప్రతిపక్షాలు అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు సీఎం రేవంత్.

ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రోత్సాహం

గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసుకుంటూ వస్తోందన్నారు. సివిల్స్‌లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఏదైనా సాధించాలనే తపన, కష్టంతో కూడిన కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని ఈ సందర్భంగా అభ్యర్థులకు సూచించారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ కావాలని ఆకాంక్షించారు.

# కన్ఫ్యూజన్‌లో గులాబీ కేడర్

-మొదటిపేజీ తరువాయి

వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, రెండు వారాల కిందట ఫ్యామిలీ సభ్యులతో కేసీఆర్ సమావేశమయ్యారు. దీనికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మరో ముగ్గురు కీలక నేతలు హాజరయ్యారు. అనారోగ్యం, వయో భారం కారణంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఆలోచన బయటపెట్టారట. పార్టీకి కావాల్సిన సలహాలు మాత్రం ఇస్తానని, మీ ముగ్గురు పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని చెప్పారట పెద్దాయన.ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా తాను కొద్దిరోజులు కంటిన్యూ అవుతానని అన్నారట. వీలు కుదిరినప్పుడు అసెంబ్లీకి వచ్చి వెళ్తానని, సమావేశాలు సైతం మీరే చూసుకోవాలని తెలిపారట. అయితే పార్టీలో ఎవరికి ఏయే పదవులు అన్నదానిపై నోరు ఎత్తలేదని తెలుస్తోంది.ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన కేటీఆర్, ప్రస్తుతం కేసీఆర్ రెస్టు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాదు పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. దీంతో అధ్యక్షుడు పోటీకి కేటీఆర్-కవిత మధ్య పోటీ నెలకొందని తెలుస్తోంది.కార్యకర్తలతో సమావేశం పెట్టినప్పుడల్లా హార్డ్ కోర్ అభిమానులు మాత్రం కేటీఆర్ సీఎం.. కవిత సీఎం స్లోగన్ చేయడం కూడా అధిపత్యం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నట్లు చెబుతున్నారు పార్టీ నేతలు. జరుగుతున్న పరిణామా లను గమనించిన కారు పార్టీ కార్యకర్తలు కాసింత




డైలామాలో పడిపోయారు. రేపోమాపో స్థానిక ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ముందు ఈ తరహా కన్ఫ్యూజన్ కరెక్ట్ కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల కేడర్ చెదిరిపోయే పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు.పార్టీ వ్యవహారాలు కేటీఆర్-కవిత చుట్టూ తిరగడంతో హరీష్‌రావు మద్దతుదారులు ఆసక్తి గమనిస్తున్నారు. పార్టీలో ఇంత జరుగుతున్నా, తమ అభిమాన నేత నోరు మెదప పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దీనిపై అప్పుడే పార్టీలో చిన్నపాటి చర్చ మొదలైపోయిందిఒకప్పుడు రూరల్‌గా బలంగా ఉండేది కారు పార్టీ. మొన్నటి ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీలో అంతర్గత వ్యవహారాలు కేడర్‌తోపాటు నేతలకు మింగుడుపడడం లేదు. ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వెయిట్ అండ్ సీ.

## ఇంకా ఎన్నాళ్లు తప్పించుకుంటారు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్



హన్మకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఇతర నాయకులను నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ చేసిన మోసంపై వరంగల్ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తే అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 7,500 ఇస్తామని చెప్పి మాట తప్పిన మీ తీరును చూసి యావత్ తెలంగాణ రైతాంగం చీదరించుకుంటున్నదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడ రైతులు తిరగబడతారో అని.. మంత్రుల పర్యటనల్లో భారీగా పోలీసులను మోహరించి ఎన్నాళ్ళు తప్పించుకుంటారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా మిమ్మల్ని ఎండగడుతూనే ఉంటామని.. ఎక్కడిక్కడ నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఎన్ని ఇబ్బందులున్నా.. రుణ మాఫీ చేస్తాం



-మొదటిపేజీ తరువాయి

పేరుతో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా తమ పథకాలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గత 10 ఏళ్లలో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ. లక్ష రుణమాఫీ సైతం చేయ లేక పోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రూ.7 లక్షల అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసిందని ఎద్దేవా చేశారు. తాము ఇచ్చిన హామీలను నిబద్ధతతో కచ్చితంగా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. 2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణ మాఫీ కాకపోతే తప్పకుండా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, కేటీఆర్‌లు అడ్డగోలుగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరి మాటలు చూస్తుంటే.. కడుపు తరుక్కుపోతుందని వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇక రైతులకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కానీ ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ.. తన సోషల్ మీడియాతోపాటు తన పత్రికలో విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. ప్రతి ఎకరాకు ఎలాంటి షరతులు లేకుండా తమ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన నుంచి రైతు భరోసా పంపిణీ చేస్తామన్నారు. ఎవరు అడ్డ పడిన.. ఎన్ని కుట్రల చేసిన రైతు భరోసా పథకాన్ని మాత్రం అమలు చేసి తీరుతామని చెప్పారు. రైతుల పక్షానే తమ ప్రభుత్వం నిలబడుతోందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క్ పిలుపు నిచ్చారు.

## రైతులకు మద్దతుగా బీఆర్ఎస్



-మొదటిపేజీ తరువాయి

అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు తెలుపుతామని తెలిపారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా ఇవ్వరా అనే దానిపై క్లారిటీ లేదని అన్నారు. ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. రైతుబంధు పథకం ఉండాలా వద్దా అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి, నిలదీయండి అని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ ఈ కాంగ్రెస్‌ను రైతన్నలు పాతరేస్తారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చేసిన దానికి మోసం అనే పదం చిన్నదైపోతది. దగా, నయవంచన పదాలు కూడా సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ రైతాంగానికి చేసిన ఈ ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్ కాంగ్రెస్/రేవంత్ అని రైతాంగానికి అర్థమైపోయిందని అన్నారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతాడని చెప్పారు. డిక్లరేషన్ కాదు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చే గ్యారెంటీ అని రాహుల్ గాంధీ అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి సంబరాలు చేయాలని కాంగ్రెస్ అంటోంది.. కానీ ఎందుకు సంబరాలు చేయాలి.. రైతన్నలకు 15000 ఇస్తామని చెప్పి కోతలు పెట్టినందుకా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి మోసం చేసినందుకు పాలాభిషేకాలు చేయాలా అని నిలదీశారు. కాంగ్రెస్ అబద్దాలకు డిక్షనరీలో కొత్త పదాలు కనిపెట్టాలని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధుకు కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ రైతుబంధుగా నిలిచారు కానీ.. రేవంత్ రెడ్డి రాబందుగా మిగులుతారని విమర్శించారు. రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 3కు ముందు తీసుకుంటే 10 వేలు, తరువాత 15 వేలు రైతు భరోసా అన్న కాంగ్రెస్ నేతల మాటలు ఎక్కడ పోయాయని నిలదీశారు. గతంలో ఇచ్చిన పదివేలనే బిచ్చం అన్న రేవంత్.. మరి నువ్వు పెంచిన వెయ్యి రూపాయలు ఏంటి? ముష్టి వేస్తున్నావా అని

## సంపాదకీయం

# మరోరూపంలో మూడు చట్టాలు

రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది. 'కాలగర్భంలో కలిసిపోయాయను కున్న మూడు నల్ల చట్టాలు మళ్లీ నెత్తిన పడతాయన్న భయం రైతులను వెంటా డుతున్నది. అందుకు తగ్గట్టుగానే 'అగ్రికల్చర్ మార్కెటింగ్' (ఎన్‌పీఎఫ్ఏఎం)పై కేంద్రం జాతీయ విధాన ముసాయిదా రూపొందించడం రైతుల ఆందోళనకు గురిచేస్తున్నది. 2021లో రద్దుచేసిన మూడు సాగు చట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చేందుకే ఈ ప్రయత్నమని, వాటి తో పోలిస్తే ఇది మరింత ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'కిసాన్ ఆందోళన్-2.0' పేరుతో 9 నెలలుగా కొనసాగుతున్న పోరాటంలో కిసాన్ యూనియన్ సిద్ధూపూర్ రాష్ట్ర అధ్యక్షుడైన జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హర్యానా-పంజాబ్ సరిహద్దులోని ఖనౌరీలో నవంబర్ 26న ఆయన ఆమరణ దీక్ష చేపట్టి రైతు ఉద్యమాన్ని మలుపుతిప్పారు. దీని తర్వాత రైతు ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయడం, రైతుల ఒత్తిడితో తిరిగి విడుదల చేయడం వివాదాస్పదమైంది. సుప్రీం ఆదేశాలతోనే డల్లేవాల్ దీక్షను భగ్నం చేశామని పోలీసులు అంటుంటే.. తామెన్నడూ అలా ఆదేశించలేదని సర్వోన్నత న్యాయస్థానం చెప్తున్నది. ఇక, పంట ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) మార్కెట్లను రద్దు చేయడంతోపాటు కాంట్రాక్ట్ సాగును ప్రోత్సహిస్తూ నిరుడు నవంబర్ 25న ముసాయిదా విధానాన్ని కేంద్రం విడుదల చేసింది. గతంలో తీసుకొచ్చిన మూడు సాగుచట్టాల్లో ఇది కూడా ఒకటి కావడంతోనే అప్పట్లో రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు మళ్లీ దీనిని దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుండటంపై మరోమారు పిడికిలెత్తారు. గత హామీల అమలు కోసం పోరాడుతుంటే అది పట్టని కేంద్రం ఇప్పుడు సాగు మొత్తాన్ని ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ఆలోచన చేస్తుండటం రైతులను విస్మయానికి గురిచేస్తున్నది. దీనికితోడు పంజాబ్‌లో ఏంపీఎంసీ మార్కెట్ల విధానాన్ని సమూలంగా మార్చాలని చూస్తుండటంతో రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అంతేకాదు, ముసాయిదా పాలసీపై స్పందించేందుకు రాష్ట్రాలకు కేంద్రం రెండువారాల సమయం మాత్రమే ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదేనని అంటున్నారు. కాబట్టి పంజాబ్ వెంటనే దీనికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, అన్ని రాష్ట్రాలు ఇదే వైఖరి అవలంబించాలని రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన అగ్రికల్చర్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీలో ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయడం, ప్రాసెసర్లు, ఎగుమతిదారు లు, వ్యవస్థీకృత రిటేలర్లు, బల్క్ బయ్యర్లను నేరుగా హోల్‌సేల్ కొనుగోలుకు అనుమతించడం వంటివి రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్ట్ సాగుపై ప్రభుత్వం పట్టుబట్టడం విమర్శలకు గురవుతున్నది. ఇది అమల్లోకి వస్తే తమ పొలంలో తామే కూలీలుగా మారిపోతామన్న భయం వారిలో వ్యక్తమవుతున్నది. మరోవైపు, దీనిపై రైతుల ఆందోళన అవసరం లేద ని, వారి మేలుకోసమే దీన్ని తీసుకొస్తున్నట్టు కేంద్రం చెప్తున్నది. ప్రైవేటు మార్కెట్ల మధ్య పోటీ పెరిగితే రైతుల మేలుకే దోహదం చేస్తుందని, వారి నికర ఆదాయాన్ని పెంచాలన్నదే తమ యోచన అని కేంద్రం వాదిస్తున్నది. ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుక్కూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.

# మళ్లీ పంజా విసురుతున్న వలసవాదం

తెలంగాణ ఏర్పడిన తొలి ఏండ్లలో రాసుకున్న మాటలను మళ్లీ ఇవాళ గుర్తుచేయాల్సిన అవసరం ఏర్పడింది. 'ఇవాళ తెలంగాణను రెండు రకాల ప్రతీప శక్తులు చుట్టు ముట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రజల బతుకులు ఒక తెరపైకి వస్తున్న ఈ సమయంలో ఓ దిక్కు వలసవాద శక్తులు మారు రూపాల్లో తెలంగాణలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్నాయి. మరో దిక్కు తెలంగాణ సమాజంలో శతాబ్దాల తరబడి పాతుకుపోయిన మత సామరస్యం, సమ్మిళిత సహజీవన సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ మత తత్వాన్ని సమాజంలో ప్రోది చేసేందుకు జాతీయ మతతత్వ శక్తులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మతపరమైన విభజన ఆధారంగా అధికారంలోకి రావాలనేది ఆ శక్తుల లక్ష్యం. ఈ రెండు రకాల ప్రతీప శక్తుల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన ఒక చారిత్రక సందర్భం మళ్లీ ప్రజల ముందు సాక్షాత్కరించింది. ఈ నేపథ్యంలో మన అప్రమత్తతే మనలను రక్షిస్తుంది. లేకుంటే తెలంగాణ 60 ఏండ్ల పాటు ఉమ్మడి రాష్ట్రంలో అరిగోస పడిన అనుభవాలను మరొక్కసారి మననం చేసుకోవాల్సి ఉన్నది' అని గతంలో రాశాను. ఇటీవలి కాలంలో.. అంటే తెలంగాణలో కేసీఆర్ ఓడిపోయి ఏపీలో చంద్రబాబు రెండవ సారి అధికారంలోకి వచ్చినాక జరిగిన కొన్ని సంఘటనలను విశ్లేషించినప్పుడు వలసవాదం మళ్లీ పంజా విసురుతున్నట్టు అర్థం అవుతున్నది. చరిత్రలో మనం ధోఖా తిన్న, మోసపోయిన అనుభవాలను ప్రస్తావించుకొని వర్తమానంలోకి వద్దాం. పచ్చని తెలంగాణ రాష్ట్రాన్ని చూసి ఓర్వలేని వలసవాద శక్తులు కేంద్రంలోని మతతత్వ శక్తుల అండతో తెలంగాణ ప్రగతిని అడ్డుకోవడానికి దూకుడును పెంచాయి. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు గమనిస్తే%% తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో 20 దాకా ప్రశ్నలు టీడీపీ, ఆంధ్ర కాంట్రాక్టర్లపై వచ్చినట్టు పత్రికల్లో విస్తృతంగా వార్తలు వచ్చాయి. వాటిపై సోషల్ మీడియాలోనూ విస్తృతంగా చర్చ జరిగింది. ఇదెట్లా సాధ్యమైంది? తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పదేండ్ల పాటు రాని ఇటువంటి ప్రశ్నలు ఆంధ్రాలో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎందుకు వచ్చినట్టు? తెలంగాణ అధికార వ్యవస్థల్లో చంద్రబాబు దళారీలు చొరబడితేనే ఇది సాధ్యమవుతుంది.

చరిత్రలో నిర్లక్ష్యం ఫలితాలు: గతంలో మనం అప్రమత్తంగా లేకపోవడం వల్ల అరవై ఏండ్లుగా ఎంతటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నష్టాలను చవి చూడవలసి వచ్చిందో ఆ చరిత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అవసరం. 1956లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు బిల్లును రూపొందించినప్పుడు బిల్లులో రాష్ట్రం పేరును 'ఆంధ్రా- తెలంగాణ'గా ఖరారు చేశారు. బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి పంపితే ఆ కమిటీ కూడా అదే పేరును ఆమోదించింది. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందే సమయంలో ఆంధ్ర లాబీయిస్టులు ఒక సవరణను ప్రతిపాదించారు. రాష్ట్రం పేరులోంచి 'తెలంగాణ' పదాన్ని తొలగించి ఆంధ్ర పక్కన 'ప్రదేశ్' అన్న హిందీ పదాన్ని చేర్చి రాష్ట్రం పేరును 'ఆంధ్రప్రదేశ్'గా మార్చారు. ఆ సవరణతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందింది.

ఈ సవరణ ప్రతిపాదిస్తున్న సమయంలో తెలంగాణ లోక్‌సభ సభ్యులు బహుశా నిద్రపోతున్నారో! మరి సభలో లేరో! కొత్త రాష్ట్రం 'ఆంధ్ర-తెలంగాణ' పేరుతో కాక 'ఆంధ్రప్రదేశ్' పేరుతో ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టుకతోనే తెలంగాణకు ద్రోహం తలపెట్టింది. తెలంగాణ అస్తిత్వానికి పాతర వేసింది. తెలంగాణ పదం ఎప్పటికైనా తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రాజేస్తుందని వారికి తెలుసు. తెలంగాణ అస్తిత్వాన్ని శాశ్వతంగా ఖతం చేయడానికే ఆ సవరణ తీసుకవచ్చి తెలంగాణ పదాన్ని తొలగింపచేశారు. ఆ తర్వాత పెద్ద మనుషుల ఒప్పందాన్ని, ఆరు సూత్రాల పథకాన్ని ఎట్లా ఉల్లంఘించారో మనందరికీ తెలిసిన చరిత్రనే.రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సేవింగ్స్ పేరా 14: 1973లో జై ఆంధ్ర ఉద్యమాన్ని చల్లార్చేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆరు సూత్రాల పథకాన్ని ప్రతిపాదించారు. ఈ పథకాన్ని తెలంగాణ నాయకత్వం ఎటువంటి విశ్లేషణ లేకుండా గుడ్డిగా అంగీకరించింది. హైదరాబాద్ రాజ్య ప్రజలు పోరాడి సాధించుకున్న 'ముల్కీ రూల్స్' రద్దు, పెద్ద మనుషుల ఒప్పందంలో ఒక ప్రధాన అంశంగా ఉండిన తెలంగాణ 'రీజినల్ కమిటీ' రద్దు కూడా ఆరు సూత్రాల పథకంలో ఉన్నాయి. ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించి అన్ని ప్రాంతాలకు సమ న్యాయాన్ని కల్పించడానికి ఉద్దేశించినదే మూడవ సూత్రం. అందులో భాగంగానే రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371-డీని రాజ్యాంగంలో చేర్చారు. ఉద్యోగాల కల్పనలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం కల్పించడానికి ఒక ఉత్తర్వును జారీ చేయడానికి రాష్ట్రపతికి 371-డీ ఆర్టికల్ ద్వారా అధికారం సంక్రమించింది. అట్లా సం క్రమించిన అధికారంతో 1975



అక్టోబర్ 18న రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడినాయి. ఆ ఉత్తర్వుల్లోని అంశాలను తెలంగాణ ఉద్యోగ సంఘ నాయకులు గాని, తెలంగాణ రాజకీయ నాయకులు గాని ఎవరూ చదివి ఉండరు. చదివినా, అందులోని కుట్రపూరితమైన పేరాలను పసిగట్టి ఉండరు. పసిగట్టినా, ఏమీ మాట్లాడలేక మిన్నకుండిపోయి ఉంటారు. రాష్ట్రపతి ఉత్తర్వులలో 'పేరా 14' అనే మినహాయింపుల క్లాజ్ (సేవింగ్స్ క్లాజ్) ఉన్నది. ఈ పేరా తెలంగాణకు ఎంతటి ఆర్థిక, సామాజిక నష్టాన్ని కలగజేసిందో అంచనా కట్టలేం. ఈ మినహాయింపుల పేరా కారణంగా సచివాలయంలో, శాఖాధిపతుల కార్యాలయాల్లో, రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో స్థానిక రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి, ఈ కార్యాలయాల్లో సీమాంధ్రులు దర్జాగా, రాజ మార్గంలో దిగబడిపోయారు. చట్టబద్ధంగానే హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాలన్నీ సీమాంధ్రుల వశమయ్యాయి. ఆర్టికల్ 371-డీ చెప్పిన అన్ని ప్రాంతాలకు సమన్యాయం ఇక్కడ భూస్థాపితమైంది. ఏపీ రాష్ట్ర అధికార కేంద్రమైన సచివాలయంలో తెలంగాణకు నామ మాత్రమైన ప్రాతినిధ్యమే దొరికింది. ప్రభుత్వ విధానాలు, బడ్జెట్ కేటాయింపులు, భూ కేటాయింపులు, పర్మిషన్లు, పోస్టింగులు, ఇతరత్రా ప్రభుత్వ నిర్ణయాలు జరిగే సచివాలయంలోని కీలక పోస్టుల్లో ప్రాతినిధ్యం లేనందు వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాకా వివక్షకు లోనై అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయింది. మనం అప్రమత్తంగా లేకపోవడం వల్ల తెలంగాణ ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి పరంగా తీవ్రంగా నష్టపోయింది.

వలసవాదం పొంచి ఉన్న పులి లాంటిది: 2014, ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేస్తున్న సమయంలో తెలంగాణ సమాజం, రాజకీయ నాయకత్వం చూపించిన అప్రమత్తతే, జాగరూకత ఇప్పుడు కూడా అవసరమే. తెలంగాణ ప్రజలు సదా అప్రమత్తంగా ఉండవలసిందే. ఇప్పుడు వలసవాదం రూపం మార్చుకొని, నినాదం మార్చుకొని తెలంగాణలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నది. అప్రమత్తతనే మనకు రక్ష. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఊహించినట్టుగానే మొదటి నాలుగేండ్లు చంద్రబాబు పాలన తెలంగాణతో ఘర్షణ వైఖరితోనే కొనసాగింది. తన దళారీ వర్గంతో ఇక్కడ తన ఆధిపత్య రాజకీయాలను నడపాలని కలగన్నాడు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేశారు. అయితే, తెలంగాణ ప్రజలు ఈ ఆంధ్రా వలసవాద పార్టీలను తెలంగాణ పొలిమేరలు దాటించారు. తెలంగాణ ఉద్యమంతో వారి దళారీ వర్గాలు బలహీనపడ్డాయి. బలహీనపడ్డాయే తప్ప పూర్తిగా అంతం కాలేదు. వలసాధిపత్యం అదను కోసం వేచిచూసే పులి లాంటిది. ఈసారి రూపం మారింది. నినాదం మారింది. 'రాజన్న రాజ్యం' అంటూ తెలంగాణ ప్రజలను మత్సరించే ప్రయత్నంలో భాగంగా ఒక దుక్నం తెరిచి గొంతు చించుకుంటూ కొంతకాలం రాష్ట్రమంతా తిరిగారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించుకుంటూ, తెలంగాణకు అనాది ఆధారాలుగా ఉన్న చెరువులను బాగు చేసుకుంటూ, తెలంగాణ వాగుల మీద చెక్‌డ్యాంలు నిర్మించుకుంటూ, కృష్ణా, గోదావరి జలాల్లో తన వాటాను సంపూర్ణంగా వినియోగించుకుంటూ దశాబ్దాల నీటి గోసను తీర్చుకుంటున్న తరుణంలో రాజన్న రాజ్యం నినాదం పేరుతో ఆంధ్రా వలసవాదం తెలంగాణ రాజకీయరంగం మీదికి చొరబడే ప్రయత్నాలు చేసి భంగపడింది. తెలంగాణ ప్రజలు స్పందించకపోయేసరికి తోక ముడిచి తెలంగాణలో దుక్నం ఎత్తేసి ఆంధ్రాలో ఉన్న మరో పాత దుక్నంలో కలిసిపోయింది. ఆంధ్రాలో చంద్రబాబు రెండవ సారి అధికారంలోకి రావడంతో తెలంగాణలో బలహీనపడిన వలసవాద శక్తులు జాతీయ మతతత్వ శక్తులతో మిలాఖతై తెలంగాణలో చొరబడాలని, తెలంగాణను ఆగం చేయాలని ప్రయత్నిస్తున్నాయి. దూకుడు పెంచిన వలసవాద శక్తులు: పదేండ్ల కేసీఆర్ పాలనాకాలంలో హైదరాబాద్ విశ్వ నగరంగా ఎదుగుతున్న దిశలో పయనించింది. అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్, ఉబర్, సేల్స్‌ఫోర్స్ లాంటి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో తమ ఇంటర్నేషనల్ క్యాంపస్‌లు నిర్మించుకున్నాయి. దీనివల్ల లక్షల మంది యువకులకు ఐటీరంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. హైదరాబాద్ నగరం అప్రతిహతంగా అభివృద్ధి దారిలో పరుగెడుతున్న దశ. రాష్ట్రంలో కాళేశ్వరం, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా తదితర ప్రాజెక్టుల నుంచి సరఫరా అవుతున్న నీటితో, పచ్చని పంటలతో, ఎండకాలంలో కూడా మత్తళ్లు దుంకుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతుండేవి. ఉమ్మడి రాష్ట్రం కరువు జిల్లాగా, వలసల జిల్లాగా దేశంలో పేరు పొందిన పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా నీటి గోస నుంచి బయటపడింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలు, చెరువుల ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందినందున మహబూబ్‌నగర్ జిల్లా కరువు నుంచి దూరమైంది. జిల్లా నుంచి వలసలు బందయ్యాయి. వ్యవసాయం పుంజుకోవడంతో ఆ జిల్లాకే పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం వస్తున్నారు. చెరువుల్లో ఏడాది పొడుగూతా నీరు నిండుగా ఉండటం, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణం కావడం వల్ల రాష్ట్రంలో భూగర్భ జలాలు అనూహ్యంగా పైకి లేచాయి. బోర్ల కింద వ్యవసాయం పుంజుకున్నది. ఒకవైపు రైతు సంక్షేమ పథకాలు, మరోవైపు పుష్కలంగా రెండు పంటలకు సాగునీరు అందడంతో రైతన్నకు వ్యవసాయంపై భరోసా పెరిగింది.

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ ఎదగడానికి రైతాంగం శ్రమపడింది. వ్యవసాయం ద్వారా అత్యధికంగా ఆదాయం పొందే రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. అన్ని మానవాభివృద్ధి సూచికల్లో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా నిలబడింది. ఇవన్నీ నిజమని ఎవరో కాదు ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాలు స్పష్టంచేశాయి. ఇదిలా ఉంటే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పాలమూరు రంగారెడ్డి, వార్ధా, సవరించిన కాళేశ్వరం డీపీఆర్‌లను కేంద్రం వెనక్కి పంపినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి. సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుమతుల ప్రక్రియ ఆగిపోయింది. ఆంధ్రలో అధికార మార్పిడి జరిగిన కొద్ది నెలల్లోనే ఈ డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయంటే చంద్రబాబు ప్రభుత్వం ఢిల్లీలో వేసిన ఎత్తుల వల్లనే అని అర్థమవుతున్నది. పాలమూరు ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాలు కేటాయించిన తర్వాతనే గత ప్రభుత్వం డీపీఆర్‌ను కేంద్ర జల సంఘానికి, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపింది. పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహా మండలి (ఈఏసీ) కూడా ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి జారీ చేయమని మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. ఏడాది గడిచిన తర్వాత ఈఏసీ సిఫారసు ఉన్న ప్రాజెక్టు డీపీఆర్‌ను పర్యావరణ అనుమతి ఇవ్వకుండానే కేంద్రం వెనక్కి పంపించిందంటే చంద్రబాబు ఒత్తిడి ఏ మేరకు ఉన్నదో అర్థమవుతున్నది. ఆయన గతంలో అధికారంలో ఉన్నప్పుడు పాలమూరు ప్రాజెక్టుపై కేంద్రానికి షికాయతులు చేస్తూ పదుల సంఖ్యలో లేఖలు రాసిన సంగతి మరచిపోరాదు. ఆంధ్రా రైతులతో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయించి ప్రాజెక్టు పురోగతిని అడ్డుకున్నాడు. ఇప్పుడు గోదావరి బనకచర్ల (పోతిరెడ్డిపాడు తూము కింద ఉన్న హెడ్ రెగ్యులేటర్ కాంప్లెక్స్) లింకు ప్రాజెక్టును సుమారు రూ.80 వేల కోట్ల కేంద్ర నిధులతో పూర్తిచేయాలని సంకల్పించాడు. 300 టీఎంసీల గోదావరి నీటిని తరలించే ఈ ప్రాజెక్టు వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పౌర సమాజం మదింపు చేయాల్సి ఉన్నది. హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం పెట్టడానికి రాష్ట్ర సర్కారు సహకరిస్తుందట. ఎందుకు? తెలంగాణలో ఇప్పటికే ఊరూరా ఏర్పాటై ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలు తక్కువైనాయా? తెలుగు జాతి పేరు చెప్పి మళ్లీ తెలంగాణను వలసవాదానికి బలి చేయడానికా? బలహీనపడిన వలసవాద దళారీ శక్తులు తిరిగి తెలంగాణలో తలెత్తుకోవడానికా? తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఏర్పాటైన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో వీక్షణం స్టాల్ మీద ఎప్పుడో ముద్రణ అయిన ఒక పుస్తకాన్ని అమ్ముతున్నందుకు మతతత్వ వాదుల దాడి జరిగిన సంగతి విస్తృతంగా చర్చకు వస్తున్నది. ఆ ఘటన అనంతరం వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడుతూనే ఉన్నారు. వేణుగోపాల్ చేసిన నేరమేమిటి? కాలానికి కాపలా కాయాలి: పొలిమేరలు దాటిన వలసవాదం జాతీయ మతతత్వ శక్తుల అండతో తిరిగి మరో రూపంలో తెలంగాణలో చొరబడడానికి దూకుడు పెంచింది. తెలంగాణ ప్రజానీకం అప్రమత్తంగా ఉండకపోతే బలహీనపడిన వలసవాద దళారీవర్గాలు బలం పుంజుకుంటాయి. తెలంగాణను వలసవాద శక్తులతో మిలాఖత్ అవుతున్న మతతత్వ శక్తుల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రజానీకం మీదనే ఉన్నది. కవి, రచయిత పరవస్తు లోకేశ్వర్ ఉద్యమ సమయంలో అన్నట్టు 'ఇప్పుడు కూడా కనురెప్పలు కత్తిరించుకొని కాలానికి కాపలా కాయాలి'.

# వైవిధ్యాన్ని కోరుకునే దర్శకుడు

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంతసులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలా మంది రచయితలకు ఎక్కువమంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాలచందర్‌తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండతెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్యతరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు.బాలచందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలకపాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్‌పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్‌పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు.

# ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం

**రాజ్యాంగం ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు**

**బి ఎం ఎస్, కేంద్ర కమిటీ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య**

**భారత రాజ్యాంగమే సకల జనులకు రక్షణ**

**ఐఎన్టీయూసీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి దాస్**

**ఘనంగా పూలే అంబేద్కర్ జ్ఞానమాల**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగమే ఆదర్శమని బిఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అన్నారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం,ఆలయ ఫౌండేషన్ తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని పట్టణం లోని పూలే అంబేద్కర్ విగ్రహాలకు బిఎంఎస్, కేంద్ర కమిటీ అధ్యక్షులు, యాదగిరి సత్తయ్య, ఐ ఎన్ టి యు సి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి దాస్, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం, యాదగిరి సత్తయ్య, వడ్డేపల్లి దాస్ మాట్లాడారు, భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడానికి భారత రాజ్యాంగమే కారణమన్నారు సకల జనులకు రక్షణగా ఉన్న, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, త్యాగధనులైన మహాత్మ జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గ్రామ గ్రామానికి అన్ని వర్గాలకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు, అన్ని వర్గాలను కలుపుకొని పోయేందుకు కృషి చేయాలని అందుకు తమ వంతుగా సహకారాన్ని అందిస్తామన్నారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, ఆధ్వర్యంలో, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు ఆలయ ఫౌండేషన్ సీఈవో,తీట్లరమేష్ బాబు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ శనిగరపు రామస్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కో కన్వీనర్లు, దుబాసి బొందయ్య, ఆకునూరి బాలా అంకుష్, గద్దల శశిభూషణ్, గోదావరి కళా సంఘాల సమైక్య సలహాదారులు కాశిపాక రాజమౌళి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ కో కన్వీనర్, గొర్రె నర్సింగరావు, ఏఐటీయూసీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఎంఎ, కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఎన్టిపిసి జ్యోతి నగర్ అధ్యక్షులు దొమ్మటి శేఖర్, శివాజీ నగర్ అధ్యక్షులు పెరిక,రవి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు డాక్టర్ కొంద్ర దాస్, కాసిపేట పోచం పాల్గొన్నారు,

# 33వ డివిజన్ సింగరేణి దత్తత తీసుకోవాలి

**సింగరేణి సిఎండి పేషిలో వినతి పత్రం అందజేసిన మద్దెల దినేష్.**




**అగ్నిధారన్యూస్,( రామగుండం)** సింగరేణి అర్జి-1 పరిధిలోని గోదావరిఖని ప్రాంతంలోని ఓసిపి -5 ప్రభావిత ప్రాంతం ఆయిన 33వ డివిజన్ సింగరేణి యాజమాన్యమే దత్తత తీసుకొని డివిజన్ అభివృద్ధి కి పాటుపడాలని, ఒపెన్ కాస్టకు అనుబంధంగా ఓబీలలో స్థానికులకు 80% ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యమే హిందూ శ్మశాన వాటికలో ఉచిత దహన సంస్కారాలు నిర్వహించాలి అని హైద్రాబాద్ లోని సింగరేణి భవన్ లో సి%డ%ఎండి బలరాం పెషి లో మద్దెల దినేష్ వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఫైట్ ఫర్ బెటర్ సొసైటి అద్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ ఓసిపి-5 ప్రభావిత ప్రాంతం అయిన 33వ డివిజన్ లో అనేక సమస్యలతో, వివిధ సౌకర్యాలు లేక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున సంక్షేమం పై దృష్టి సారించాలని, ముఖ్యంగా నూతన రోడ్లు వేయాలని,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య తీర్చాలని అలాగే సింగరేణి సెక్టార్ -2 కమ్యూనిటీ హాల్ ని మిని బ్యాంకేట్ హాల్ గా మార్చాలని, దాని ముందు గల ఖాళీ స్థలం సింగరేణి పార్క్ ఏర్పాటు చేసి ఒపెన్ జిమ్ మరియు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, బోరింగ్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఓపెన్ కాస్ట్ ల అనుబంధంగా ఉన్న ఓబీ కంపెనీలలో స్థానికేతరులు కాకుండా స్థానికులకే 80% ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని మా వంతుగా హైకోర్టును ఆశ్రయిస్తే హైకోర్టు 80% స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశాలు జారీచేసి ఆర్డర్ ఇచ్చిన కానీ వాటిని అమలు చేయడంలో ఓబి కంపెనీల యాజమాన్యాలు కొంతమంది సింగరేణి అధికారులు పట్టించుకోకుండా అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై వారికి సహకరిస్తూ వారు చెప్పిన వారికే ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని, ఇలానే పునరావృతం అయితే మరల హై కోర్టులో కన్టెప్ట్ వేయడం జరుగుతుందన్నారు. సింగరేణి యాజమాన్యమే ప్రభావిత ప్రాంతాలలో పాటు హిందూ స్మశానంలో దురదృష్టవశాత్తూ ఎవరైన మృతి చెందితే ఉచితం దహన సంస్కారాలు నిర్వహించాలని సి ఏం డిని కోరామని దినేష్ తెలిపారు.

# భద్రత మీ జీవితానికి సురక్ష



**... ప్రమాదారహిత కమీషనరేట్ మార్పుకు అందరం సహకరించాలి**

**రోడ్డు భద్రత నిబంధనలు అందరూ తప్పనిసరిగా పాటించాలి**

**: పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,**

**రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కమిషనరేట్ లో 5కే రన్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ప్రమాద రహిత కమిషనరేట్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి అని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో 5కే రన్ చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ సీఎం శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి సిపి అనంతరం శాంతి కపోతాలను ఎగరవేసి 5కే రన్ ను జెండా ఊపి ప్రారంభించి పోలీస్ అధికారులు, సిబ్బంది తో కలిసి కమిషనరేట్ కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం మీదుగా గాంధీ చౌరస్తా వరకు పెద్దఎత్తున 200మంది పోలీస్ అధికారులు, సిబ్బంది తో నిర్వహించిన 5కే రన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ..వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటారని, వారి జీవితాలకు భరోసా ఉంటుందని సీపీ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాహనదారులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఎక్కువ శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలనీ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని యువత తాత్కాలిక ఆనందం కోసం ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్, చేస్తూ విలువైన ప్రాణాలు విడిస్తున్నారు, ప్రమాదాలకు గురై తల్లితండ్రులకు మనో వేదనను మిగిలిస్తున్నారు. తోటి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రతి సంవత్సరం అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ తగ్గడం లేదని ప్రజలు చైతన్యవంతులై ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు వారికి సహకరించాలన్నారు గత ఏడాది కాలంలో రామగుండం కమిషనరేట్ ట్రాఫిక్ పోలీస్ వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు 13 కోట్ల రూపాయల జరిమానాలు విధించడం జరిగింది అని సిపి కూడా తెలిపారు.

5కే రన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సిపి అభినందించారు.


ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, పెద్ద పెల్లి ఏసిపి జి కృష్ణ, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, ఏ ఆర్ ఏ సి పి లు ప్రతాప్, సుందర్రావు , ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు అనిల్ కుమార్, సత్యనారాయణ, లు కమీషనర్ పరిధిలోని సిఐలు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాహిత్య అకాడమీలో నేషనల్ అవార్డు అందుకున్న దాసరి శ్రావణ్



**అగ్ని ధార న్యూస్. మందమర్రి జనవరి 5.:** బహుజన సాహిత్య అకాడమీ 8వ,తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్ లో నేషనల్ అవార్డు అందుకున్న దాసరి శ్రావణ్ కుమార్, నేషనల్ అవార్డు తీసుకున్నాడు. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగినటువంటి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లాల రాధాకృష్ణ,చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా నల్లాల రాధాకృష్ణ మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకు పోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రజా ఉద్యమకారులకు,సంఘ సేవలకు, కవులకు, రచయితలకు,మరియు స్వచ్ఛంద సంస్థలకు,ఈ అవార్డులను అందజేసినట్లు అంతేకాకుండా అవార్డు గ్రహీత దాసరి శ్రావణ్ కుమార్,మందమర్రి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా తమ విధులు నిర్వహిస్తూ.. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్లాల రాధాకృష్ణ,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎం.గౌతం, రాష్ట్ర కమిటీ సభ్యులు బదేవెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# గుండారం రిజార్వాయర్ ను మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయాలి..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలంలోని గుండారం రిజార్వాయర్ నాలుగు మండలాలకు ( కమాన్ పూర్, రామగిరి, ముత్తారం, మంథని) వరప్రదాయనిగా విరాజిల్లుతుంది. ఎంతో ప్రాధాన్యత కల్గిన గుండారం రిజార్వాయర్ ను మినీ ట్యాంక్ బండ్ గా మార్చే విధంగా నిధులు మంజూరు చేసి కృషి చేయాలని కోరుతూ.. గుండారం తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు ఆధ్వర్యంలో రాష్ట్ర ఐ. టి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆదివారం కమాన్ పూర్ మండల కేంద్రంలో పర్యటించిన సందర్భంగా వినతి పత్రం అందజేశారు.గుండారం రిజార్వాయర్ మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయడం వల్ల మంథని నియోజకవర్గంలోని ప్రజలకే కాకుండా పరిసర ప్రాంతాల నుండి పర్యాటకులు సందర్శించనున్నారని ఆ పత్రిక ప్రకటలో వెల్లడించారు.

# కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** ఎన్ టి పి సి హెచ్ఆర్ డైరెక్టర్ జాడ్లిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్, ఎన్టిపిసి పట్టణ కమిటీ అధ్యక్షులు ఆసిఫ్ పాషా లు ఆదివారం నాడు దేశ రాజధాని ఢిల్లీ ఎన్టిపిసి ఆఫీస్ లో కలసి కాంట్రాక్టు కార్మికుల సమస్య ల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు ఫిట్నెస్ వున్నవారిని 65 సంవత్సరాల వరకు కొనసాగించాలన్నారు. కార్మికులకు సూపర్ స్పెషలిటీ హిస్పిటల్ సదుపాయం కల్పించాలని,ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్ కార్పొరేట్ తరహాలో ఉచితముగా నిర్వహించాలని కోరారు.. క్రీడల గురించి కార్మికుల పిల్లలకు లోకల్ యువతకు, క్రీడాకారులకు అనువుగా ఉండేవిధముగా అన్ని సదుపాయాల తొ వున్న ఒక ఆధునిక స్టేడియం నిర్మించాలని కోరారు. హైటెన్షన్ టవర్ లైన్ (టిజి ట్రాన్సకో వారివి ) లను పూర్తిగా తొలిగించాలాన్నారు. మెయిన్ రోడ్ కు రెండు వైపులా మిగిలిన సర్వీస్ రోడ్ లను ఎమ్మార్వో ఆఫీస్ వరకు పొడగించి పూర్తి చేయాలని కోరారు. ఎన్టిపిసి హెచ్ఆర్ డైరెక్టర్ వెంటనే స్పందించి అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# శ్రీవచ సేవా సంస్థ ఆధ్వర్యంలో... ఘనంగా సన్మానం



**అగ్ని ధార న్యూస్. మందమర్రి జనవరి 5. :** జాతీయ స్థాయి యోగ పోటీల్లో ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్న మన మందమర్రి పట్టణానికి చెందిన కొంపెల్లి రమేష్ ని, వారి స్వగృహంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఉప్పలంచి చంద్రకాంత్,దాసరి శ్రీకాంత్,మాచర్ల వెంకటస్వామి, తుంగపిండి సాగర్, కిషోర్.ఎండీ. జావిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో... సంతాపం




**అగ్ని ధార న్యూస్. మందమర్రి జనవరి 5. :** బిసి కుల సంఘాల ఐక్యవేదిక మందమర్రి, నాయకులు గాజుల ప్రతాప్ సతీమణి,గాజుల చంద్రకళ స్వర్గస్తులైనందున,దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పిస్తూ...వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, తెలియజేస్తూ..ధైర్యాన్ని కలిగి ఉండాలని వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో.. పాల్గొన్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పెద్దపెల్లి సత్యనారాయణ, ముల్కల రాజేంద్రప్రసాద్, వాసాల సాగర్,రామటంకి దుర్గారాజ్, జంజీరాల వెంకటేష్,నీలం రమేష్,బండారి సత్యనారాయణ, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ప్రతి పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి అని కమాన్ పూర్ లయన్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి సత్య సాయి సేవ సమితి జిల్లా కన్వీనర్ నూక రమేష్ అన్నారు. ఆదివారం కమాన్ పూర్ మండల కేంద్రంతోపాటు తదితర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ మరియు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అమృత కళాశాలు అనగా బీదవారికి నెలసరి బియ్యం తదితర వస్తువులను నెల గాసం అందజేశారు. మొదటి ఆదివారం 16 మందికి నిత్యవసర సరుకులు అందజేయడం జరుగుతుంది. సుమారు 22 వేల రూపాయల విలువ గల నిత్యవసర వస్తువులు వేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు కడుపు ఆకలితో ఉండకుండా మా సాయి శక్తుల వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే మరి కొంతమంది బీదవారికి సైతం అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.సత్య సాయి కన్వీనర్ నూక రమేష్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, లయన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, బుగ్గజి, తాటిపాముల శ్రీనివాస్, కందికట్ల భాస్కర్, , లయన్ అనవేన లక్ష్మీరాజు, లయన్ జబ్బార్ ఖాన్ . తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి ఆత్మీయ సత్కారం..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రంలో రాష్ట్ర, ఐ. టి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అంబీరు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ సయిాద్ అన్వర్ తో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ కో – అప్షన్ సభ్యులకు ఎం. డి ముస్తాక్ అహ్మద్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కోలేటి కుటుంబానికి మంత్రి పరామర్శ..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు కోలేటి మారుతి తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐ. టి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం మారుతితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతకు ముందు స్వర్గీయ సుశీలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం హర్షణీయం

### తెలంగాణ టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి ప్రాంతం నుండి ఉత్తమ పార్లమెంటురియన్ స్వర్గీయ జైపాల్ రెడ్డి పేరు పెట్టడం గొప్ప స్ఫూర్తిదాయకం అని తెలంగాణ టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ,నాలుగు జిల్లాలను పూర్తిస్థాయిలో సస్యశ్యామలను చేసి వ్యవసాయ రంగంలో మరియు త్రాగునీరు సమస్యను తీర్చే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టు మన ప్రాంతానికి చెందిన తెలంగాణ సాధకుడు ప్రజాస్వామ్య వాదిగా పిలువబడే కాంగ్రెస్ నాయకుడు సూదిని జైపాల్ రెడ్డిని వచ్చేతరం గుర్తించే విధంగా పేరు పెట్టడం తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేయడం సంతోషం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి మరియు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రేమ్ కు శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** ఊరుకొండ మండలం రెడ్యతాండ నుంచి తెలంగాణ రాష్ట్రం డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ సెక్రటేరియట్ ఉద్యోగ సంఘం ఎన్నికల్లలో ప్రధాన కార్యదర్శి గా భారీ మెజార్టీతో విజయం సాధించిన జరుపులావత్ ప్రేమ్ కు జిల్లెల్ల మాజీ సర్పంచ్ గుమ్మ కొండ రాములు ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో సచివాలయం లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ఉద్యమమే తన ఊపిరిగా పెట్టుకొని విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా అనేక పోరాటాలు చేసి, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషిస్తూనే గ్రూప్ 2 ఉద్యోగం సాధించి రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగం చేస్తూ గత ప్రభుత్వంలో బంగారు తెలంగాణ భాగమై మరియు ఇప్పుడు ప్రజా పాలనలో భాగంగా పనిచేస్తూ సచివాలయం ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించాలని 10 సంవత్సరాలు పోరాటం చేసి ఇప్పుడు తెలంగాణ ఏర్పాటై 10 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా జరిగిన ఉద్యోగ సంఘ ఎన్నికలలో ప్రేమ్ భారీ మెజారిటీ తో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్,జిల్లెల్ల దేవాలయ చైర్మన్ కొమ్మగోని రవి గౌడ్, రమణ గౌడ్, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కమాన్ పూర్ గ్రామ పంచాయతీని మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ గ్రామ పంచాయతీని మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇది గ్రామ ప్రజల ఆకాంక్ష అను తెలియజేస్తూ.. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ఆదివారం కమాన్ పూర్ మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజల తరుపున వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంయిక్తంగా వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంతో పాటు సుమారు 350 మంది సంతకాల సేకరణతో మంత్రి శ్రీధర్ బాబు కి వినతి పత్రాన్ని అందజేశారు. చిన్న గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయని,. కమాన్ పూర్ గ్రామ పంచాయతీ నుండి ఇప్పటికే సిద్దిపల్లె, శాలపల్లె, బుర్రకాయల పల్లెలతో సిద్దిపల్లె గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసి కమాన్ పూర్ గ్రామ పంచాయతీ విస్తీర్ణాన్ని కుదించడం జరిగిందన్నారు. మళ్ళీ మరోమారు కిష్టంపల్లె, బాపూజీ నగర్, పిల్లిపల్లె లతో కలిపి కిష్టంపల్లె నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లిన సందర్భంలో, కమాన్ పూర్ గ్రామపంచాయతీకి అనుకోని ఉన్న కిష్టంపల్లె ని గ్రామపంచాయతీ చేయడం వలన అనేక రకాల ఇబ్బందులు



తలెత్తుతాయని, శ్రీధర్ బాబుకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో కుక్క చంద్రమౌళి, మచ్చగిరి రాము, జంగపల్లి శ్రీనివాస్, మల్లారపు అరుణ్ కుమార్, జంగపెల్లి అజయ్, పోతుల కుమార్ తదితరులున్నారు.

# కాంగ్రెస్ పార్టీ రైతు ప్రభుత్వం .. ప్రజల ప్రభుత్వం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి


**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సహాయం. రైతు భరోసా, ఎకరానికి 12,000రూపాయలు రేషన్ కార్డులు లేని వారికి నూతన రేషన్ కార్డులు జనవరి 26వ తేదీ నుండి ప్రారంభించడం సంతోషించ దగ్గ విషయం అని కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రైతు పాలన



నడుస్తుందని రైతు భరోసా పథకానికి ఎకరానికి సంవత్సరానికి 12,000 వేల రూపాయలు భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12,000 ఆర్థిక సహాయం చేస్తుంది అని ,ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు లేని తెలంగాణ ప్రజలకు నూతన రేషన్ కార్డుల జారీ చేయడం వంటి కార్యక్రమాలను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో జనవరి 26వ తేదీ నుండి ప్రారంభించడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న శుభ సందర్భంగా తెలంగాణ ప్రజల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# నరేందర్ రెడ్డి చిత్ర పటానికి నిహాళులు

### తెలంగాణ టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి సోదరుడుకీ.శే.నరేందర్ రెడ్డి ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ టాస్క్ సి ఓ, ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు సాను భూతి తెలుపుతూ కీ.శే.డోకూరి నరేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో,మాజీ సర్పంచులు వెంకట్రాం రెడ్డి ,శ్యాంసుందర్ రెడ్డి ,నరేందర్ గౌడ్ రచ్చ శ్రీరాములు ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మండ్లి రాములు,కసి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,యువజన నాయకులు రాజశేఖర్,ఇమ్రాన్ బాబా,సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్,దాస్ నాయక్,బాలునాయక్,విజయ్ లతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన అనుషకు సన్మానం

### ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన సంగనామని జంగయ్య కూతురు అనుష కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన సందర్భంగా ఈరోజు తలకొండపల్లి జెడ్పిటిసి మాజీ తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా కానిస్టేబుల్ అనూష అనే అమ్మాయికి వెంకటేష్ భార్య మంజుల తో కలిసి సన్మానించడం జరిగింది. అనంతరం అనుష ఉప్పల వెంకటేష్ మంజుల దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

# మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ ఆద్వర్యంలో ఆర్ధిక సహాయం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కాడరి వెంకటయ్య గత వారం రోజుల క్రితం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మార్చాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 5500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశం పుల్ల రెడ్డి,రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కృష్ణరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ వట్టేపు బాలయ్య,మాజీ సర్పంచ్ సునీత వెంకటరెడ్డి, వట్టేపు కృష్ణయ్య, మాజీ ఎంపిటిసి కడల సంతోష మల్లేష్,మాజీ ఉప సర్పంచ్ మదన్మోహన్ రావు, మాజీ వార్డు సభ్యులు రామ్ రెడ్డి, డొక్క లింగం, నరేష్ గౌడ్,చెదురుపల్లి కృష్ణయ్య ,కల్వకుర్తి మండల బి ఆర్ ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు వట్టేపు కిషోర్, బి ఆర్ ఎస్ పార్టీ సినియర్,నాయకులు నిజాం సర్కార్, తాండ్ర తిరుపతయ్య, యువ నాయకులు,వట్టేపు గణేష్ , రాజు, జంగయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయి..



**అగ్నిధారన్యూస్, సుల్తానాబాద్** జనవరి, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పెద్దపల్లి జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు అన్నారు. సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్,కబడ్డీ, అథ్లెటిక్స్, షటిల్ బ్యాట్మెంటన్ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవకుండా సన్మార్గం లో నడవడానికి క్రీడలు దోహదపడతాయని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర దారుఢ్యనికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులు గెలుపోవటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. వాలీబాల్ విజేతగా సుల్తానాబాద్ జట్టు, ద్వితీయ బహుమతిగా సుల్తాన్పూర్ జట్టు గెలుచుకున్నారు.కబడ్డీ పోటీలలో పోత్కపల్లి జట్టు ప్రథమ బహుమతి గెలుచుకోగా సుల్తానాబాద్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. షటిల్ బ్యాడ్మింటన్, రన్నింగ్,షాట్ పుట్ విజేతగా నిలిచిన జట్లకు రూ 4 వేల విలువగల స్పోర్ట్స్ కిట్, మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ డి ఆంజనేయులు,స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమీర్ శెట్టి తిరుపతి,సీనియర్ క్రీడాకారుడు జిలాని,సత్యం సతీష్,నెహ్రూ యువ కేంద్రం సభ్యులు మహేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



**అగ్నిధార న్యూస్( సంగారెడ్డి జిల్లా)** జహీరాబాద్ నియోజకవర్గ ము, జహీరాబాద్ మండల్ బూచి నేల్లి గ్రామంలో సారనాథ్ బుద్ధ విహార్ దగ్గర నిర్వహించిన కార్యక్రమాలు మొదటగా సామూహిక ధ్యానం ధ్యానం ద్వారా మనిషి ఏ విధంగా తన ఆరోగ్యాన్ని ఆయుష్షును పెంచుకోగలడో తథాగత గౌతమ బుద్ధుడు వివరించిన విధానాన్ని బుద్దిస్ట్ నాయకులు తెలపడం జరిగింది. ఆ తర్వాత సమతా సైనిక్ దళ్ నాయకులు బుద్ధ, దమ్మ, సంఘ సంపూర్ణ వందనను చేశారు ప్రపంచ దేశాలన్నీ అత్యుత్తమ మతంగా బౌద్ధాన్ని ఎన్నుకోవడం పట్ల బుద్దిస్ట్ సొసైటీ నాయకులు మరియు సమతా సైనిక్ దళ్ నాయకులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

బౌద్ధాన్ని గౌతమ బుద్ధుడు ప్రపంచానికి అందించిన సందేశాన్ని, సామ్రాట్ అశోక చక్రవర్తి బౌద్ధాన్ని ప్రపంచమయం చేసిన విధానాన్ని ఆ తర్వాత బౌద్ధం కనుమరుగవుతున్న క్రమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 లో బౌద్ధాన్ని స్వీకరించి పునర్జీవనం పోసిన విధానం గురించి వక్తలు బౌద్ధంపై మాట్లాడడం జరిగింది.భవిష్యత్తులో అందరి సహాయ సహకారాలతో ఈ విహార్ను మరింత అభివృద్ధి చేసుకుందామని చర్చించడం జరిగింది.

# భూమిలేని నిరుపేదలకు రూ 12వేల ఆర్థిక చేయుత

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం చారిత్రాత్మకం వ్యవసాయ యోగ్యమైన భూములు అన్నింటికి రైతు భరోసా పన్నెండు వేలు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి కలెక్టరేట్,జనవరి 5**

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** అన్నదాతల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు రైతులకు అన్ని విధాలుగా లబ్ధిచేకురుస్తున్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు 12000 ఆర్థిక సహాయం, వ్యవసాయోగమైన భూములన్నిటికీ రైతు భరోసా కింద 12 వేల రూపాయలు ప్రతి ఎకరాకు అందించడంపట్ల నిర్ణయం తీసుకోవడంతో ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ

ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతు భరోసాను రూ 12 వేలకుపెఒచిందన్నారు. గత ప్రభుత్వం కేవలం రూ.10 వేలు రైతు బంధు ఇచ్చిందని అంతకంటే ఎక్కువగా రైతు భరోసా పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులందరికీ పెట్టుబడి సాయం చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి షరతుల్లేకుండా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ప్రతీ ఎకరానికి రైతు భరోసా చెల్లింపు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చెల్లించినట్లుగా రాళ్లు రప్పలు, రోడ్లు రహదారులకు, రియల్? ఎస్టేట్? వెంచర్లకు రైతు భరోసా నిలిపివేయడంతో నిజమైన రైతన్నలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ అనర్హులను గుర్తించి తొలగించే ప్రక్రియను ప్రత్యేక అధికారుల బృందం చేపడుతుందని ఆయన అన్నారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీ నాటికి 75 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఈ రిపబ్లిక్ డే ఉత్సవాల ను పురస్కరించుకుని అదే రోజు నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆర్థికంగా అదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు నగదు ఆర్థిక సహాయం అందజేయున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రామగిరి ఖిల్లా ను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం

### – మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**అగ్నిధార న్యూస్ మంథని :** రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ మండలాల్లో ఆదివారం పర్యటించిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామగిరి ఖిల్లా ను అభివృద్ధి చేయడం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి మన జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఐదు కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగింది. బేగంపేట, రత్నాపూర్ గ్రామాల నుండి రామగిరి ఖిల్లా కు ఇరువైపులా రోడ్లు అభివృద్ధి చేయడం కొరకు, రామగిరి ఖిల్లా పై మౌలిక వసతులు కల్పించడం కొరకు ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. రామగిరి ఖిల్లా పై ఎన్నో ఔషధ మొక్కలు ఉన్నాయని, శ్రీరాముడు నడిచిన నేల గా ప్రసిద్ధి అని ఇలాంటి పుణ్యక్షేత్రాన్ని అన్ని హంగులతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రామగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం కొరకు ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు మంజూరు కొరకు కృషి చేస్తామని తెలిపారు.



# పంట పండించే ప్రతి రైతుకు రైతు భరోసా



## సాగు భూములకే సాయం పట్ల సంతోషం

### జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతంగానికి కొత్త సంవత్సరంలో మంచి జరగాలని వ్యవసాయాన్ని పండుగ చేయాలని ఉద్దేశంతో నిన్న సాయంత్రం జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు భరోసా పై కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలియజేసుకుంటున్నామని లికిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు యాదయ్య ముదిరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి సమద్దఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 26 నుండి అంటే రాజ్యాంగం జరిగి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు మూడు పథకాలను అమలులోకి తేవడం పట్ల చాలా సంతోషకరమని సాగుచేసిన భూములకే రైతు భరోసా కింద ఎకరాకు 12 వేలు చెల్లింపు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కుటుంబ రైతులందరికీ ఏడాదికి రూ 12 వేలు అందించడం అదేవిధంగా 10 ఏళ్లు ఎదురు చూస్తున్న నిరుపేద ప్రజలు అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతున్నాము. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయం చేయాని రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్లకు, పరిశ్రమల భూములకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, వందల ఎకరాలను కబ్జా చేసిన నాయకుల భూములకు ఇచ్చి రైతు బంధు పేరుతో రూ 22 వేల కోట్లు ప్రజాధనాన్ని బీఆర్ఎస్ నాయకులు దుర్వినియోగం చేసి నిజమైన రైతులకు ఇవ్వకుండా అసాములైన పెద్ద పెద్ద రైతులకు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా తయారు చేసిందిని వారు అన్నారు ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వన్న ఎలాంటి షరతులు లేకుండా సాగు చేసి పంట పండించే ప్రతి రైతుకు అందే విధంగా పంట పెట్టుబడి కోసం ఆర్థిక సాయం ప్రకటించి రైతు భరోసా ఇవ్వడం పట్ల చాలా సంతోషకరమైన విషయమని అలాగే పాలమూరు ముద్దుబిడ్డ అయినా దివంగత నేత ఎస్ జైపాల్ రెడ్డి పేరుతో పాలమూరు ప్రాజెక్టుకు పేరు పెట్టడం చాలా సంతోషమని తెలియజేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం పైన ప్రజల ఆశీస్సులు, దేవుని దివ్యనలు ఉండేలా ప్రార్థించాలని ప్రజలను కోరుతున్నాను.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన "నల్ల"



**అగ్నిధారన్యూస్ ఓదెల:** పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండల కేంద్రంలో ఓదెల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు మండలాల క్రికెట్ టోర్నమెంట్ కి నిర్వాహకుల ఆహ్వానం మేరకు పాల్గొని మొదటి మ్యాచ్ ను నల్ల ఫౌండేషన్ చైర్మన్,రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డితో పాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, క్రీడా అభిమానులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు.

# సివిల్స్ విద్యార్థులకు అభయహస్తం చెక్కుల పంపిణీ

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.



**అగ్నిధార న్యూస్ హైదరాబాద్ :** మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ఆదివారం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు.

# తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపిన మాజీలు



**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా:** ఆదివారం తెలంగాణ భవన్ లో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేసిన మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజరెడ్డి,మాజీ ఎం పి రావుల చెంద్రశేఖర్ రెడ్డి,మాజీ మ్మెల్యే ఆలా వేంకటేశ్వర రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల తారక రమా రావు మాట్లాడుతూ 2025 సంవత్సరములో తెలంగాణ ప్రజలందరికీ, మంచి జరగాలని తనకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యేలకు తిరిగి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా పాలమూరు లో పార్టీపరంగా చేయవలసిన కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఏఎంసి కి సన్మానం.....



**అగ్నిధార న్యూస్, మేడిపల్లి మండలం,జనవరి 5 :** మేడిపల్లి మండలం కల్వకోట గ్రామంలో యాదవ కుల బంధావులు ఆదివారం రోజున నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మొబీన్ పాషాను ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ యాదవులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకోట తాజా మాజీ సర్పంచ్ అదే హన్మక్క, మాజీ సర్పంచ్ అదే లక్మిరాజం,అదే రవీందర్, రమేష్,మ్యకల దుబ్బయ,మహేందర్, తాలూకా అంజయ్య, రాచర్ల అంజయ్య,రవి తేజ, కమలాకర్, నర్సయ్య, అనంతం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ గంగాదేవి అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరణ



**అగ్నిధార న్యూస్ మంథని :** బెస్తపల్లి, దుబ్బపల్లి, చందనాపూర్ గ్రామాల గంగపుత్రుల కులదైవమైన శ్రీశ్రీశ్రీ గంగాదేవి ఆలయ కమిటీ వారు ముద్రించిన క్యాలెండర్ ను ఆదివారం ఆవిష్కరించారు. కుల పెద్దబోయ బోరె లింగయ్య గంగపుత్ర చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. శ్రీ గంగాదేవి నిత్య దీపారాధన కమిటీ ఆధ్వర్యంలో కుల దైవం పై భక్తితో భక్తుల విరాళాలతో మూడవ సంవత్సరం మూడు ప్రకటనలతో తయారుచేసిన ఈ క్యాలెండర్ బెస్తపల్లి గ్రామ గంగపుత్ర మత్స్యకారలు కుల పెద్దలు అలాగే యువత మహిళలు పెద్దల సమక్షం లో ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేశారు.

# తరగతి గదులను పరిశీలించిన అధికారులు



**అగ్నిధారన్యూస్ మంథని :** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మంథనిలో జరుగుతున్న ఓపెన్ టెన్త్ ఇంటర్ తరగతులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసరావు పరిశీలించారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ టెన్త్ ఇంటర్ మంచి అవకాశమని వినియోగించుకొని ఉన్నత చదువులు జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. సెలవు రోజులలో జరుగుతున్న తరగతులను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కోరారు. తరగతులకు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొంతుల కుమార్, పోచయ్య ,కేశవులు , విజయ కుమార్ పాల్గొన్నారు.

# నేడు మంథని నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటన

## - పలు అభివృద్ధి పనులకు శంకస్థాపనలు



**అగ్నిధార న్యూస్ మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో సోమవారం సాయంత్రం 4-00 గంటలకు టీయఎఫ్ఐడిసి నిధుల నుండి మంథని మున్సిపాలిలోని శ్రీరామ్ నగర్ వద్ద 6.71 కోట్లతో శ్రీరామ్ నగర్ నుండి మాత శిశు హాస్పిటల్ వరకు, పోచమ్మవాడ %శ% నుండి ఆర్టీసీ బస్ డిపో వరకు, హాస్పిటల్ కాటారం రోడ్డు, గిట్ల రమణారెడ్డి పోచమ్మ వాడ, మార్కెట్ యార్డ్, గంగాపూర్ ఎక్స్ రోడ్, కూచిరాజుపల్లి ఎక్స్ రోడ్, శ్రీరామ్ నగర్ ఐమస్ లైట్స్ సోలార్ పనుల కోసం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసి సాయంత్రం 4-10 గంటలకు టీయఎఫ్ఐడిసి నిధుల నుండి మంథని మున్సిపాలిలోని ఫైర్ స్టేషన్ వద్ద 8.14 కోట్లతో సమీకృత వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం , వివిధ వార్డులలో సైడ్ డ్రెన్స్ , సిసి రోడ్ల నిర్మాణం, సాయంత్రం 4-20 గంటలకు టీయఎఫ్ఐడిసి నిధుల నుండి మంథని మున్సిపాలిలోని పాత సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వద్ద 9.20 కోట్లతో మంథని మునిసిపాలిటీ నూతన భవన నిర్మాణం, డంపింగ్ యార్డ్, సిగ్రేషన్ షెడ్, డి ఆర్ సి సి కంపోస్ట్ షెడ్, ఆఫీస్ రూమ్, సెక్యూరిటీ రూమ్, టాయిలెట్స్, వేయింగ్ బ్రిడ్జి, ఆర్చిల నిర్మాణం(1) పెద్దపల్లి నుండి మంథని రోడ్డు పట్టణ పరిధి ప్రారంభంలో ఆర్చి నిర్మాణం. (2) గోదావరిఖని నుండి మంథని రోడ్డు పట్టణ పరిధి ప్రారంభంలో ఆర్చి నిర్మాణం. (3) కాటారం నుండి మంథని రోడ్డు పట్టణ పరిధి ప్రారంభంలో ఆర్చి నిర్మాణ పనుల కోసం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మంథని మున్సిపల్ లో టీయఎఫ్ఐడిసి నిధులు 24.05 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి మంథని గాంధీ చౌక్ లో సభా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# యూట్యూబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



**అగ్నిధారన్యూస్, పెద్దపల్లి:** తెలంగాణ యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించే సమావేశం సందర్భంగా మార్బల్ అండ్ టైల్స్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కల్లపల్లి రవిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పెద్దపల్లి పట్టణ బిజెపి అధ్యక్షులు కావేటి రాజగోపాల్, తెలంగాణ యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మంద భాస్కర్ యాదవ్, కోశాధికారి పసులేటి సదయ్య, జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి రామ్మూర్తి, మార్కు లక్ష్మణ్, ధర్మేందర్, కృష్ణ, రమేష్, మహమ్మద్ బాబా, సలేంద్ర రాజన్న, సతీష్, జయదేవ్, మల్లన్న, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలు అబద్ధం.. వరంగల్ డిక్లరేషన్ మోసం

**కృష్ణకాలనీ, జనవరి 5 :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అబద్ధం..చివరకు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఎకరానికి రూ.15వేలు ఇస్తానని మోసం చేసిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని గత్యంతరం లేని పరిస్థితులో శనివారం క్యాబినెట్ మీటింగ్ పెట్టి రైతు డిక్లరేషన్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వరంగల్‌లో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని రైతు డిక్లరేషన్ చేసి, ఇప్పుడు రూ.12వేలు ఇస్తానని రైతులను మోసం చేసిందని అన్నారు. రైతుల కిచ్చిన హామీల గురించి అడిగితే ప్రభుత్వం ముఖం చాటేస్తున్నదని మండిపడ్డారు. అంతే కాదు.. రూ.2లక్షల రుణమాఫీ ఇప్పటి వరకు కొద్దిమందికి మాత్రమే జరిగిందన్నారు. రైతుభరోసా పూర్తిస్థాయిలో రుణమాఫీ, సన్న, దొడ్డు వడ్లకు రూ. 500బోనస్, వృద్ధులకు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, మహిళలకు రూ. 2,500, రూ.500కే గ్యాస్, నిరుద్యోగ భృతి, కల్యాణ లక్ష్మి తులం బంగారం పథకాలను ఎప్పుడు ఇస్తారో ప్రకటించి, కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శబ్దం వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే మోసం, దగా రసమయి బాలకిషన్

**మానకొండూర్ రూరల్ :** ఆరో గ్యారంటీ అయిన రైతు బంధు కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఎలక్షన్ల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని మానకొండూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో రైతు భరోసాకు రూ.15 వేలు ఇవ్వాలని రైతుల తరఫున నిరసన, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి మాట, ప్రతి హామీని విస్మరిస్తున్నారని, కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని మళ్లీ మళ్లీ నిరూపించుకున్నదని మండిపడ్డారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాట మార్చడం సరికాదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు టెక్నికల్ ఎఫెక్ట్





**కరీంనగర్ :** ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం, నిలువ నీడలేని నిరుపేదలకు స్వంత ఇంటి కలను నిజం చేస్తాం'... ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హామీ. ఈ హామీని నిలబెట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక కోసం ముమ్మరంగా సర్వే చేపట్టింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.గ్రామీణ ప్రాంతాల్లో నెట్ వర్క్ ప్రాబ్లం ఉండగా పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో లేకపోవడం అడ్రస్ సరిగా ఉండకపోవడంతో సర్వేకు ఆటంకంగా మారింది. డిసెంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా సాంకేతిక సమస్యలతో జనవరి 3 వరకు 75% మాత్రమే సర్వే పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త పర్వాలేదనుకున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం 70 శాతం కూడా పూర్తి కాలేదు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సర్వే అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు.పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్ల లో నెట్ వర్క్ ప్రాబ్లాన్ని అధికమించేలా గ్రామ కార్యదర్శి హరికృష్ణ పొడవాటి కర్రకు సెల్ ఫోన్ కట్టి హాట్ స్పాట్ ఆన్ చేసి ట్యాబ్ కు కనెక్ట్ చేసుకుని యాప్ లో సర్వే డేటా పొందుపర్చి ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తి చేశారు. నెట్వర్క్ ప్రాబ్లం, సాంకేతిక సమస్యలతో రోజుకు 10 నుంచి 15 ఇళ్ల కంటే ఎక్కువ సర్వే చేయలేకపోతున్నామని పలు గ్రామల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ళ కోసం ప్రభుత్వానికి ప్రజాపాలన కార్యక్రమంలో 8054554 దరఖాస్తులు రాగ, ఇప్పటివరకు 5990889 సర్వే నిర్వహించారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 94 శాతం సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో అతి తక్కువగా 16 శాతం దరఖాస్తులపైనే సర్వే జరిగింది. కరీంనగర్ నగరం పాలక సంస్థలో 56 శాతం సర్వే పూర్తయింది. హైదరాబాద్ మినహాయించి మిగతా 32 జిల్లాల్లో వారం పదిరోజుల్లో 100 శాతం సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సర్వేను వేగవంతం చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కరీంనగర్ జిల్లాలో 82 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,10,677 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు గ్రామాల్లో 88 శాతం, మున్సిపాలిటీలైన జమ్మికుంటలో 96.94 శాతం, హుజురాబాద్ లో 90.75 శాతం, చొప్పదండిలో 84.01 శాతం, కొత్తపల్లిలో 72.15 శాతం, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 56 శాతం సర్వే పూర్తయినట్లు కలెక్టర్ పమెలా సత్పతి ప్రకటించారు. త్వరగా పూర్తిచేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని తెలిపారు.మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా పక్కాగా వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రోజు వారీగా పూర్తయిన సర్వే వివరాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని సూచించారు.సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. అనంతరం గ్రామాల వారీగా లబ్దిదారుల ఎంపిక జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపిస్తారు. కలెక్టర్లు పరిశీలించాక ఇన్చార్జి మంత్రులకు పంపిస్తారు. ఇన్చార్జి మంత్రి ఆమోదం తెలిపితే లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నగదును విడతల వారీగా జమచేస్తారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు.ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకున్నా, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఇంటి యాజమాన్ల వివరాలను సైతం సర్వే యాప్ లో పొందుపర్చాలని క్షేత్రస్థాయి అధికారులను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే? అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్ లో పొందుపరుస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని తెలిపారు.

# కేసీఆర్ రైతుబంధుగా నిలిచారు

## రేవంత్ రెడ్డి మాత్రం రాబందుగా మిగిలిపోతారు



కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా, నయవంచన అని మరోసారి రుజువయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు 12 వేలకు కుదించడం రైతులను నిలువునా వంచించడమే అని విమర్శించారు. ఈ ద్రోహాన్ని తెలంగాణ రైతాంగం ఎప్పటికీ క్షమించరని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ ఈ కాంగ్రెస్‌ను రైతన్నలు పాతరేస్తారని అన్నారు. కాంగ్రెస్ చేసిన దానికి మోసం అనే పదం చిన్నదైపోతది. దగా, నయవంచన పదాలు కూడా సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ రైతాంగానికి చేసిన ఈ ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్ కాంగ్రెస్/రేవంత్ అని రైతాంగానికి అర్థమైపోయిందని అన్నారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతాడని చెప్పారు. డిక్లరేషన్ కాదు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చే గ్యారెంటీ అని రాహుల్ గాంధీ అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి సంబరాలు చేయాలని కాంగ్రెస్ అంటోంది.. కానీ ఎందుకు సంబరాలు చేయాలి.. రైతన్నలకు 15000 ఇస్తామని చెప్పి కోతలు పెట్టినందుకా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి మోసం చేసినందుకు పాలాభిషేకాలు చేయాలా అని నిలదీశారు. కాంగ్రెస్ అబద్దాలకు డిక్షనరీలో కొత్త పదాలు కనిపెట్టాలని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధుకు కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ రైతుబంధుగా నిలిచారు కానీ.. రేవంత్ రెడ్డి రాబందుగా మిగులుతారని విమర్శించారు. రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 3కు ముందు తీసుకుంటే 10 వేలు, తరువాత 15 వేలు రైతు భరోసా అన్న కాంగ్రెస్ నేతల మాటలు ఎక్కడ పోయాయని నిలదీశారు. గతంలో ఇచ్చిన పదివేలనే బిచ్చం అన్న రేవంత్.. మరి నువ్వు పెంచిన వెయ్యి రూపాయలు ఏంటి? ముష్టి వేస్తున్నావా అని మండిపడ్డారు. ఓడ దాటే దాక ఓడ మల్లన్న.. ఓడ దాటాక బోడి మల్లన్న.. ఇదే కాంగ్రెస్ తీరు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ నుంచి రాహుల్ దాకా రైతులకు చెప్పిందేంటి? చేసిందేంటి అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా అని నిలదీశారు. దీనికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి తీరని ద్రోహం చేసినందుకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో రేరవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలని అన్నారు. నమ్మించి నయవంచన చేసినందుకు రాహుల్ గాంధీ 70 లక్షల మంది రైతులకు క్షమాపణలు చెప్పాలన్నారు. మ్యానిఫెస్టోలో రైతులకిచ్చిన ప్రధాన హామీని నిలబెట్టుకోనందుకు ముఖ్యమంత్రి ముందుగా రాష్ట్ర రైతాంగం ముందు లెంపలేసుకోవాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు రైతుభరోసాపై మాట మార్చినందుకు ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలన్నారు.

**తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నాశనం చేసింది ముమ్మాటికీ రేవంత్ రెడ్డినే : కేటీఆర్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల పరిస్థితులు బాగుండేదని రేవంత్ రెడ్డి అన్నారని కేటీఆర్ తెలిపారు. సీఎం పదవిలో కూర్చొని రేవంత్ రెడ్డి తెలంగాణను కించపరిచారని విమర్శించారు. ఎవరిని మోసం చేయడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని దివాళాకోరు మాటలు ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక జీతాలు ఇచ్చిన తెలంగాణ రాష్ట్రం గురించి రేవంత్ అవమానకరంగా మాట్లాడారని కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇచ్చింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణలోనే ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దిగజారిందని రేవంత్ మాట్లాడడం వారిని అవమానపరచడమే అని అన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి అనేక గొప్ప కార్యక్రమాలను ఎంతో కృషితో పూర్తి చేసిన ప్రభుత్వ ఉద్యోగుల స్థితిగతులపైన సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం కాదు కాంగ్రెస్ నేతల మానసిక పరిస్థితి బాగోలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నాశనం చేసింది ముమ్మాటికీ రేవంత్ రెడ్డినే అని విమర్శించారు. మూర?ంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని కేటీఆర్ అన్నారు. సంవత్సరంలో లక్షా 38 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు.కేసీఆర్ అప్పు చేస్తే ప్రజలకు పంచారని.. మరి రేవంత్ అప్పు చేసి ఢిల్లీకి మూటలు పంపుతున్నారా అని ప్రశ్నించారు. దివాలా తీసింది తెలంగాణ రాష్ట్రం కాదు అని.. దివాళా తీసింది రేవంత్ రెడ్డి మెదడు అని ఎద్దేవా చేశారు. రూ. 5,943కోట్ల రెవెన్యూ మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించామని తెలిపారు. రేవంత్ రెడ్డి నోటికి వచ్చినట్లు అబద్ధం మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# కేటీఆర్ అరెస్ట్ తప్పదా

**హైదరాబాద్ :** ఫార్ములా ఈ రేస్ కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రమేయం ఉన్న వారి దర్యాప్తు ఒక్కొక్కటిగా జరగనుంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ బీఎల్ఎన్ రెడ్డి త్వరలోనే ఈడీ ముందు హాజరు కాబోతున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఈడీ ముందు హాజరు అయ్యారు. అలాగే ఈ నెల 7న ఈడీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. పెమా చట్టాన్ని ఉల్లంఘించి హెచ్ఎండీఏ నిధులను విదేశీ కంపెనీకి బదిలీ చేసినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ఆయన తాత్కాలిక బెయిల్ కోసం ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.అలాగే ఫార్ములా-ఇ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ముగించింది. తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయకూడదని ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ క్రమంలో కేటీఆర్ కు ఏసీబీ నోటీసు జారీ చేసింది. ఈ నెల 6న విచారణకు హాజరు కావాలని నోటీసులలో పేర్కొన్నారు. కేటీఆర్ తో పాటు, ఈ కేసులో అధికారులకు కూడా నోటీసులు జారీ చేసింది. అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేసింది. 7న విచారణకు హాజరు కావాలని వారిని ఆదేశించారు. ఈ కేసులో ఏసీబీ నమోదు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఫార్ములా ఇప్పటికే రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే.మరోవైపు ఇదే కేసులో ఈడీ ఈ నెల 7న విచారణకు హాజరు కావాలని కేటీఆర్ కు సమన్లను పంపింది. దీంతో ఈ నెల 6న ఏసీబీ విచారణకు హాజరు కానున్న కేటీఆర్..ఆ తర్వాత రోజే ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉంది. దీంతో కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణలకు హాజరవుతారా లేక కోర్టును ఆశ్రయిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఈ కేసులో ఏసీబీ సేకరించిన ఆధారాలను తీసుకుని ఈడీ విచారణ జరపాల్సి ఉంది. దీంతో ఏసీబీ విచారణ తర్వాత అవే ఆధారాలతో ఈడీ కేటీఆర్ ను ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. విచారణలో వాస్తవాలు వెల్లడి అయితే కేటీఆర్ ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని కొందరు విశ్లేషిస్తున్నారు.అసలు కేటీఆర్ అరెస్ట్ గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com